



రెండు జిల్లాల్లో టీడీపీ అభ్యర్థులు వీరే..

నియోజకవర్గం	అభ్యర్థులు
విజయవాడ తూర్పు	గద్దె రామ్మోహన్
విజయవాడ సెంట్రల్	బొండా ఉమామహేశ్వరరావు
నందిగామ	తంగిరాల సౌమ్య
జగ్గయ్యపేట	శ్రీరాం రాజగోపాల్ తాతయ్య
తిరువూరు	కొలికపూడి శ్రీనివాస్
మచిలీపట్నం	కొల్లు రవీంద్ర
పెడన	కాగిత కృష్ణప్రసాద్
గుడివాడ	వెనిగండ్ల రాము
గన్నవరం	యార్లగడ్డ వెంకట్రావు
పామర్రు	వర్ల కుమార్ రాజా


కొల్లు రవీంద్ర
(మచిలీపట్నం)


వెనిగండ్ల రాము
(గుడివాడ)


యార్లగడ్డ వెంకట్రావు
(గన్నవరం)


వర్ల కుమార్ రాజా
(పామర్రు)


కాగిత కృష్ణప్రసాద్
(పెడన)


తంగిరాల సౌమ్య
(నందిగామ)




తొలి పది

రెండు జిల్లాల్లో పదిమంది టీడీపీ అభ్యర్థులు ఖరారు

ఉత్కంఠకు తెరపడింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన టీడీపీ-జనసేన అభ్యర్థుల జాబితా శనివారం విడుదలైంది. రెండు జిల్లాల్లో 14 నియోజకవర్గాల్లోని 10 స్థానాలకు టీడీపీ అభ్యర్థులు ఖరారయ్యారు. విధేయతకు పట్టం కడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులకే పదింట ఆరు స్థానాల్లో అధినేత చంద్రబాబు అవకాశం ఇవ్వగా, నాలుగింట కొత్తవారు బరిలో దిగుతున్నారు. ఇక ఇరు జిల్లాల్లోని జనసేన టికెట్లు, అభ్యర్థుల అంశంపై మాత్రం స్పష్టత రాలేదు. టీడీపీ అధినేత నిర్ణయంపై అంతటా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.


గద్దె రామ్మోహన్
(విజయవాడ తూర్పు)


బొండా ఉమామహేశ్వరరావు
(విజయవాడ సెంట్రల్)


శ్రీరాం రాజగోపాల్ తాతయ్య
(జగ్గయ్యపేట)


- పెనమలూరు, అవనిగడ్డ, పశ్చిమ, మైలవరం పెండింగ్
- పదింట ఆరుగురు పాత అభ్యర్థులకే అవకాశం
- నాలుగు స్థానాల్లో కొత్తవారు
- చంద్రబాబు తొలి జాబితాపై హర్షాతిరేకాలు
- జనసేన టికెట్లు, అభ్యర్థులపై రాని స్పష్టత
- రెండు జిల్లాల్లో రెండు సీట్లు కేటాయించే చాన్స్

(విజయవాడ/మచిలీపట్నం-ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల సమరానికి ప్రధాన పార్టీలు సమాయత్తమవుతున్నాయి. అధికార వైసీపీ ఇప్పటికే పలు విడతలుగా తన అభ్యర్థులను ప్రకటించగా, తాజాగా టీడీపీ-జనసేన ఉమ్మడిగా పోటీచేసే తమ అభ్యర్థులను శనివారం ప్రకటించాయి. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో టీడీపీ-జనసేన అభ్యర్థుల పేర్లు కూడా తొలి జాబితాలో ఉన్నాయి. మొత్తం 14 నియోజకవర్గాల్లో 10 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ప్రస్తుతం ప్రకటించినవన్నీ టీడీపీ పోటీచేసే స్థానాలు కాగా, జనసేన అభ్యర్థులపై స్పష్టత రావాల్సి ఉంది. వైసీపీ ఏడు విడతలుగా 8 మంది అభ్యర్థులనే ప్రకటించగా, టీడీపీ-జనసేన ఒకేసారి 10 స్థానాలకు ప్రకటించడం విశేషం. ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం, విజయవాడ పశ్చిమ, కృష్ణాజిల్లాలో పెనమలూరు, అవనిగడ్డకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఈ నాలుగు స్థానాల్లో రెండు జనసేనకు ఇస్తారని సమాచారం. పెనమలూరు, మైలవరం స్థానాల నుంచి బరిలోకి దిగేందుకు అభ్యర్థుల నడుమ పోటీ ఎక్కువగా ఉంది. మాజీ మంత్రి దేవినేని ఉమా, వైసీపీ నుంచి టీడీపీలో చేరనున్న వసంత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్ ఈ రెండు స్థానాల కోసం రేసులో ఉన్నారు. కాగా, ప్రస్తుతం ప్రకటించిన జాబితా విషయంలో టీడీపీ-జనసేన శ్రేణులు ఆనందంగా ఉన్నాయి.

అభ్యర్థుల బయోడేటాలు

- 6లో..


కొలికపూడి శ్రీనివాస్
(తిరువూరు)


కొలుసు పార్థసారథి
(నూజివీడు)

తిరువూరులో మార్పు

ప్రస్తుతం ప్రకటించిన 10 స్థానాల్లో ఒక్క తిరువూరులోనే ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న శావల దేవదత్ స్థానంలో కొలికపూడి శ్రీనివాసరావుకు టికెట్ లభించింది. అయితే, ఇక్కడ అభ్యర్థి మార్పుపై శావల దేవదత్‌తో ముందే పార్టీ పెద్దలు చర్చలు జరిపారు. దీంతో ఆయన నుంచి ఎలాంటి అసంతృప్తి వ్యక్తం కాలేదు. పార్టీ అధికారంలోకి వచ్చాక దేవదత్‌కు తగిన గుర్తింపు ఇస్తామని పెద్దలు అభయమిచ్చారు. దీంతో కొలికపూడి శ్రీనివాస్ అభ్యర్థిత్వాన్ని దత్ స్వాగతించారు. ఇక పెడన నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించిన టీడీపీ నేత బూరగడ్డ వేదవ్యాస్ పార్టీ నిర్ణయంపై అసంతృప్తితో ఉన్నారు. తొలి జాబితాలో చోటు దక్కని అవనిగడ్డ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు కాస్త అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, వారందరికీ సర్దిచెబుతూ మండలి బుద్ధప్రసాద్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఇక పెనమలూరు సిటింగ్ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి నూజివీడు టికెట్ కేటాయించారు.


బంటుమిల్లిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

ఆరుగురు పాత.. నలుగురు కొత్త..

టీడీపీ-జనసేన తొలి జాబితాలో చోటు దక్కించుకున్న 10 మంది అభ్యర్థుల్లో ఆరుగురు 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున అవే స్థానాల నుంచి పోటీ చేసినవారే. తిరువూరు, పామర్రు, గన్నవరం, గుడివాడ కొత్తవారికి అవకాశం కల్పించారు. వీరిలో గన్నవరం నుంచి బరిలో ఉన్న యార్లగడ్డ వెంకట్రావు 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున అదే స్థానం నుంచి పోటీపడిన వారే. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే కేవలం ముగ్గురే తొలిసారి పోటీ చేస్తున్నవారు.


రొయ్యూరు క్వారీలో బారులుగా నిలిచిన ఇసుక లారీలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మోర్ల రాంబాబు, లుక్కా నాగబాబు

అర్ధరాత్రి అడ్డగింపు

రొయ్యూరులో ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్థులు

- రహదారికి ట్రాక్టర్ అడ్డుపెట్టి లారీల నిలిపివేత
- పలాయనం చిత్తగించిన నిర్వాహకులు, మంత్రి అనుచరులు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 24 : తోట్లవల్లూరు మండలం రొయ్యూరు క్వారీలో అక్రమంగా తవ్వుతున్న ఇసుక తవ్వకాలను శుక్రవారం అర్ధరాత్రి గ్రామస్థులు అడ్డుకున్నారు. మోర్ల రాంబాబు, లుక్కా నాగబాబు ఆధ్వర్యంలో సుమారు 20 మంది అర్ధరాత్రి 11 గంటలకు రెండు ట్రాక్టర్లను తెచ్చి రహదారికి అడ్డుగా పెట్టి ఇసుక లారీలను నిలిపివేశారు. పట్టా భూములకు అనుమతి తీసుకుని, ప్రభుత్వ భూముల్లో

- మిగతా 6లో

వెలుగులోకి మరిన్ని వెకిలి చేష్టలు

బయటకొస్తున్న స్పెషల్ డివిజన్ సూపరింటెండెంట్ బాధితులు

జలవనరుల శాఖలో చర్చనీయాంశంగా మారిన ఉద్యోగి లీలలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : జలవనరుల శాఖ స్పెషల్ డివిజన్ సూపరింటెండెంట్ లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఉద్యోగినులను టార్గెట్ చేసుకుని ఆయన చేసిన వెకిలిచేష్టలకు బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. స్పెషల్ డివిజన్‌లో జరుగుతున్న ఈ లీలలపై 'వెకిలి చేష్టలు.. వెక్కిరింతలు..' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం జలవనరుల శాఖలో ప్రకంపనలు సృష్టించింది. దీనిపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. ఇంతకుముందు ఈ ఉద్యోగి కృష్ణా సెంట్రల్ డివిజన్‌లో పనిచేశాడు. అక్కడా ఇలాగే మహిళా అటెండర్లు, గుమస్తాల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిసింది. ఆయన ఆగడాలు శ్రుతిమించడంతో బాధితులు ఉద్యోగ సంఘ నేతలకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఆయనను పిలిపించి ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించారు. అయినా ఆ ఉద్యోగి పద్ధతి మార్చుకోలేదు.

సెలవుల్లో మహిళా ఉద్యోగులకు విధులు

స్పెషల్ డివిజన్‌లో ఐదుగురు మహిళా అటెండర్లు ఉన్నారు. వారికి సెలవుల్లోనూ ఈ సూపరింటెండెంట్ కావాలని విధులు కేటాయించేవాడని సమాచారం. పండుగలు, రెండో శనివారం, ఆదివారాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ఉంటాయి. అత్యవసర పరిస్థితులు ఏర్పడతాయన్న ఉద్దేశంతో కిందిస్థాయి ఉద్యోగులకు డ్యూటీలు వేస్తారు. దీన్ని అవకాశంగా మార్చుకుని ఈ ఉద్యోగి మహిళా అటెండర్లతో సెలవు రోజుల్లో డ్యూటీలు చేయించేవాడు. ఒక్కోసారి ఒక్కొక్కరికి డ్యూటీలు వేసేవాడు. ఆరోజు ఆయన కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకపోయినా పని ఉన్నట్టు వచ్చి ఆఫీసులోనే ఉండేవాడు. కార్యాలయానికి రెండువైపులా తలుపులు ఉన్నప్పటికీ ఒకవైపు ఉన్న తలుపులు మాత్రమే తీసి ఉంచేవాడు. వాచ్‌మెన్లు ఎవరైనా కార్యాలయంలోకి వచ్చి కూర్చుంటే సార్‌కు చిర్రెత్తుకొచ్చేది. తోక తొక్కిన పాములా విరుచుకుపడేవాడు. అసలు ఆఫీసులో ఏం పని ఉందని ఆగ్రహం వ్యక్తం చేసి బయటకు పంపేవాడని బాధితులు చెబుతున్నారు. మహిళా ఉద్యోగులు ఒంటరిగా ఉండటంతో ద్వంద్వార్థాలతో మాట్లాడేవాడని కన్నీరుమున్నీరయ్యారు. ఈ సూపరింటెండెంట్ వేధింపులు భరించలేక మహిళా ఉద్యోగులు ఇతర డివిజన్లకు బదిలీపై వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. దీనికీ ఆయన అడ్డుకట్ట వేసేవాడు. కిందిస్థాయి ఉద్యోగులు లేకపోతే కార్యాలయం ఫైళ్లు అధికారుల వద్దకు వెళ్లవని, మిగిలిన ఉద్యోగులకు ఇబ్బంది అవుతుందని ఉన్నతాధికారులకు చెప్పి బదిలీలకు బ్రేక్‌లు వేయించేవాడు. ఓ మహిళా ఉద్యోగిని వేధించడంతో ఆమె తండ్రి కార్యాలయంలోనే ఆ ఉద్యోగి చెంపచెళ్లుమనిపించిన విషయం తెలిసిందే. ఇలాంటి ఉద్యోగులను కార్యాలయంలో కాకుండా బయట ప్రాంగణంలో చెంప చెళ్లుమనిపించాలని మహిళా ఉద్యోగులు వ్యాఖ్యానించారు.

ఇద్దరూ ఇద్దరే..!

కలెక్టరేట్‌లోని జేసీ చాంబరులో సీసీల అవినీతి



- పనులపై వచ్చిన వారికి అర్థంలేని ఆంక్షలు
- ఉన్నతాధికారికి సమస్య చెప్పుకొనే చాన్స్ ఇవ్వరు
- జేసీ బంగ్లా నిర్మాణం పేరిట వసూళ్లు
- రికార్డ్‌రూమ్‌లో రంగూన్ టేకు ఏమైనట్టో..
- బి-సెక్షన్ బిల్లుల్లో భారీగా మింగుడు

వారు కలెక్టరేట్‌లోని జేసీ కార్యాలయంలో ఇద్దరు క్యాంప్ క్లర్క్ (సీసీ)లు. అయితేనేం.. వ్యవహారాలన్నీ తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. సమస్యలను తెలియజేసేందుకు జిల్లా నలుమూలల నుంచి వచ్చే వారిని గేటు బయటే ఆపేస్తారు. సామాన్యులైతే పక్కన నిలబడాలి.. కాస్త సూటు బూటు వేసుకుని ఉంటే పక్కకు తీసుకెళ్లిపోయి బేరాలు మాట్లాడేస్తారు. జేసీ బంగ్లా నిర్మాణం పేరిట దోచుకోవడం మొదలు అనాథ పిల్లల కోసం నిర్మించే గృహానికి విరాళాల వరకూ వీరి అవినీతికి అంతే ఉండదు. ఇక బి-సెక్షన్‌లో బిల్లుల గోల్‌మాల్‌లో ఈ ఇద్దరి చేతివాటంపై కలెక్టరేట్ మొత్తం కోడైకూస్తోంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కలెక్టరేట్‌లోని జేసీ కార్యాలయంలో 18 ఏళ్లుగా డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఒక ఉద్యోగి అన్నీ తానై చక్రం తిప్పుతున్నాడు. ఈ ఉద్యోగికి ఇటీవల గుడివాడ నుంచి వచ్చిన మరో సీసీ తోడయ్యాడు. దీంతో ఈ ఇద్దరూ చెప్పిందే వేదంగా ఇక్కడ పాలన సాగుతోంది. భూమి వ్యవహారాలు, ధాన్యం కొనుగోలులో ఉన్న ఇబ్బందులు, ఇతర అంశాలపై రైతులు జేసీతో మాట్లాడదామని వస్తే వారిని గేటు కూడా దాటనివ్వరు. వారు తెచ్చిన కాగితాలను పరిశీలించి, మండలాల అధికారులతో మాట్లాడి, అక్కడి నుంచి వచ్చిన సంకేతాల ఆధారంగా బాధితులను వెనక్కి పంపేస్తున్నారు. ఇటీవల జేసీ చాంబరును ఆధునికీకరించారు. సీసీలు కూర్చునేందుకు జేసీ చాంబర్ ఎదురుగా ప్రత్యేక గదిని నిర్మించారు. జేసీతో మాట్లాడేందుకు ఎవరైనా వస్తే అనేక ఆంక్షలు పెడుతున్నారు. జేసీ చాంబరులోకి వెళ్లి సమస్యలను చెప్పుకొనేలోపే ఈ ఇద్దరిలో ఒకరు వచ్చి 'ఇక చాలు రమ్మంటూ..' వెనక్కి పిలుస్తారు.

జేసీ బంగ్లా నిర్మాణం పేరుతో వసూళ్ల దందా

మచిలీపట్నం నాయర్ బడ్డీ సెంటర్ సమీపంలోని జేసీ పాతబంగ్లాను కూలగొట్టి కొత్తది నిర్మిస్తున్నారు. రూ.50 లక్షల అంచనాతో నిర్మించే ఈ బంగ్లాకు ప్రభుత్వ నిధులను వినియోగిస్తున్నారు. అయితే, ఈ నిర్మాణాన్ని సాకుగా చూపి ఆ ఇద్దరు సీసీలు వసూళ్లపర్వానికి తెరతీశారనే విమర్శలు వస్తున్నాయి. గతంలో పనిచేసిన జేసీ విధుల నిర్వహణలో బిజీగా ఉండగా, సీసీలు కార్యాలయానికి వచ్చిన తహసీల్దార్లు, ఇతర విభాగాల అధికారులను తమ దారిలోకి తెచ్చుకున్నారు. వారితో ఇసుక, ఇనుము ఇతరత్రాలను సమకూర్చాలని చెప్పి పెద్దమొత్తంలో వసూలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీసీలు చెప్పిన పనిచేయకుంటే ఎక్కడ ఇబ్బందులు పడతామనే భయంతో అధికారులు సైతం వీరి ప్రతిపాదనలకు అనుగుణంగా నడుచుకున్నట్లు కలెక్టరేట్ ఉద్యోగులే చెప్పుకొంటున్నారు. కీలకమైన ఫైళ్లు వస్తే, తొక్కిపెట్టి తమవద్దే ఉంచేసుకుంటున్నారు. ఈ విషయాన్ని గమనించిన నూతన జేసీ అన్ని ఫైళ్లను తన వద్దకు పంపాలని హెచ్చరించారని సమాచారం.

శిశుగృహ నిర్మాణం పేరిట వసూళ్లు

పోర్టు రోడ్డులో ఉన్న జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ భవనం వద్ద అనాథల కోసం నూతన శిశు గృహాన్ని నిర్మించారు. గతంలో పనిచేసిన జేసీ.. ఈ భవన నిర్మాణం కోసం బ్యాంకు అధికారులతో మాట్లాడి వారి సీఎస్ఆర్ నిధుల నుంచి, అలాగే, ఒకరిద్దరు జిల్లా అధికారులు, వ్యాపారుల నుంచి నిధులు సమకూర్చారు. ఈ భవనం నిర్మాణం పూర్తై ప్రారంభించారు. కానీ, ఈ భవనం పేరుచెప్పి వివిధ పనులపై కార్యాలయానికి వస్తున్న వారి వద్ద ఈ ఇద్దరు సీసీలు విరాళాలు సేకరిస్తున్నారు. ఇలా భారీ మొత్తంలో పోగేశారనే ఆరోపణలు వస్తున్నాయి.

బి-సెక్షన్‌లో గోల్‌మాల్

జిల్లాస్థాయి అధికారుల పర్యటనలు, ఇతరత్రా ఖర్చులకు సంబంధించి ట్రెజరీతో సంబంధం లేకుండా కలెక్టరేట్‌లోని బి-సెక్షన్‌కు బిల్లులు పంపి నగదు తీసుకునే వెసులుబాటు ఉంది. దీనిని ఈ ఇద్దరు ఉద్యోగులు అక్షయపాత్రగా మలుచుకున్నారు. వివిధ బిల్లులు పెట్టి పెద్దమొత్తంలో నగదు డ్రా చేసుకుంటున్నారని సీనియర్ అధికారులే చెబుతున్నారు. భూసేకరణ నిమిత్తం వచ్చిన కోట్లాది రూపాయలు కలెక్టరేట్‌లోని భూసేకరణ విభాగానికి జమ అవుతాయి. ఈ నగదుకు సంబంధించిన మొత్తాన్ని వివిధ బ్యాంకుల్లో ఉంచితే, నెలనెలా వడ్డీ జమ అవుతుంది. భూసేకరణ విభాగానికి వడ్డీ రూపంలో ఎంతమేర నగదు వచ్చిందో తెలుసుకుని, బి-సెక్షన్‌కు పంపిన బిల్లులనే భూసేకరణ విభాగానికి పంపి, ఈ ఇద్దరు ఉద్యోగులు సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం. బిల్లులను పూర్తిస్థాయిలో పరిశీలిస్తే వీరి అక్రమాలు బయట పడతాయని కలెక్టరేట్ ఉద్యోగులే పేర్కొంటున్నారు.

రికార్డు రూమ్ రంగూన్ టేకు మాయం

కలెక్టర్ కార్యాలయం ఎదురుగా బ్రిటీష్ కాలంలో నిర్మించిన రికార్డ్ రూమ్ ఉంది. ఈ భవనం శ్లాబుకు పగుళ్లిచ్చి వర్షాకాలంలో నీరు రికార్డు రూమ్‌లోకి చేరుతోంది. పాతకాలం నాటి భవనం శ్లాబును తొలగించి ఇటీవల ఇనుప రేకులు వేశారు. శ్లాబు తొలగించే సమయంలో విలువైన రంగూన్ టేకు దుంగలను, పలకలను ఈ ఇద్దరు ఉద్యోగులు తీసుకెళ్లారు. జేసీ నూతన గృహ నిర్మాణంలో ఉపయోగిస్తామని పెద్దమొత్తంలో కలపను మాయం చేశారనే ఆరోపణలు వచ్చాయి.

• జనసంద్రం

మాఘపౌర్ణమి వేళ భక్తులు సింధు స్నానాలు ఆచరించారు. హంసలదీవి సముద్రతీరం శనివారం భక్తజనంతో కిటకిటలాడింది. సుమారు 40 వేల మంది భక్తులు సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

- 6లో..



నేడు గ్రూపు-2 పరీక్ష

పక్కా ఏర్పాట్లు చేసిన యంత్రాంగం

- జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలు
- మచిలీపట్నంలోనే 11 కేంద్రాలు
- 144 సెక్షన్ అమలు
- అరగంట ముందే రావాలి : ఎస్పీ సూచన

- 6లో..

టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అభ్యర్థుల వివరాలు

నియోజకవర్గం: విజయవాడ సెంట్రల్
అభ్యర్థి పేరు: బొండా ఉమామహేశ్వరరావు
విద్యాభ్యాసం: అండర్ గ్రాడ్యుయేషన్
కులం: కాపు
వయస్సు: 58
భార్య పేరు: బొండా సుజాత
పిల్లలు: బొండా సిద్ధార్థ(అమెరికా), జశ్వంతి (కోడలు), బొండారవితేజ(లాయర్)

రాజకీయ నేపథ్యం: టీడీపీలో 2013 నుంచి పనిచేస్తున్నారు. 2014లో విజయ వాడ సెంట్రల్ నుంచి ఎమ్మెల్యేగా వైసీపీ అభ్యర్థి పూనూరు గౌతమ్‌రెడ్డిపై 25 వేలపై చిలుకు ఓట్లతో గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసి వైసీపీ అభ్యర్థి మల్లాది విష్ణు చేతిలో 25 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.

నియోజకవర్గం: విజయవాడ తూర్పు
అభ్యర్థి పేరు: గద్దె రామ్మోహన్
విద్యాభ్యాసం: ఎంఎస్సీ మైక్రోబయాలజీ
కులం: కమ్మ
వయస్సు: 64
భార్య పేరు: గద్దె అనురాధ
పిల్లలు: ఇద్దరు కుమారులు

రాజకీయ నేపథ్యం: గన్నవరం నియోజకవర్గం నుంచి 1994లో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. తర్వాత టీడీపీలో చేరి 1999లో విజయ వాడ ఎంపీగా గెలుపొందారు. 2004లో కంకిపాడు నుంచి పోటీచేసి ఓడిపో యారు. 2009లో విజయవాడ తూర్పు నుంచి ఓడిపోయారు. 2014, 2019 ఎన్నికల్లో తూర్పు నుంచి పోటీ చేసి వరుస విజయాలు సాధించారు.

నియోజకవర్గం: తిరువూరు
అభ్యర్థి పేరు: కొలికపూడి శ్రీనివాసరావు
విద్యాభ్యాసం: డబుల్ ఎం.ఎ, కేఎస్‌రావు ఐఏఎస్ అకాడమీ నిర్వాహకుడు
కులం: ఎస్సీ(మాదిగ)
వయస్సు: 56
భార్య పేరు: మాధవి
పిల్లలు: కుమార్తె(సాయిఅక్షర)

రాజకీయ నేపథ్యం: స్వస్థలం గుంటూరు జిల్లా తాడికొండ. అమరావతి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. తిరువూరు నియోజక వర్గంలో కిడ్నీ బాధితులకు తాగు నీటి కోసం పాదయాత్ర చేయడంతో పాటు పలు ప్రజా సమస్యలపై ఉద్యమిస్తుంటారు.

నియోజకవర్గం: నందిగామ
అభ్యర్థి పేరు: తంగిరాల సౌమ్య
విద్యాభ్యాసం: బీటెక్ చేశారు. బెంగళూరులో కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేశారు.
కులం: ఎస్సీ(మాదిగ)
వయస్సు: 43
భర్త పేరు: మోహనరావు
పిల్లలు: ఇద్దరు(కుమార్తె, కుమారుడు)

రాజకీయ నేపథ్యం: తండ్రి తంగిరాల ప్రభాకరరావు నందిగామ శాసనసభ్యుడిగా 2009, 2014లో గెలుపొందారు. ఆయన అకాల మరణంతో రాజకీయాలలోకి వచ్చిన సౌమ్య ఉప ఎన్నికలో భారీ మెజారిటీతో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో ఆమె ఓటమి చెందారు.

నియోజకవర్గం:: జగ్గయ్యపేట
అభ్యర్థి పేరు: శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)
విద్యాభ్యాసం: డిగ్రీ
కులం: వైశ్య
వయస్సు: 55
భార్య పేరు: శ్రీదేవి
పిల్లలు: ఇద్దరు(కుమార్తె, కుమారుడు) డాక్టర్ కృష్ణ మైథిలి, కృష్ణ పవన్

రాజకీయ నేపథ్యం: కళాశాల నుంచే విద్యార్థి సంఘ రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు. కాంగ్రెస్ జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడిగా 20 ఏళ్లు పైగా పనిచేశారు. జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత టీడీపీలో చేరారు. 2009, 2014లో వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో ఓడిపోయారు.

కృష్ణా జిల్లా అభ్యర్థుల వివరాలు

నియోజకవర్గం: పెడన
అభ్యర్థి పేరు: కాగిత కృష్ణ ప్రసాద్
విద్యాభ్యాసం: బీటెక్(కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు)
కులం: గౌడ
వయస్సు: 42
భార్య పేరు: కాగిత శిరీష
పిల్లలు: కుమార్తె, కుమారుడు(కాగిత లలిత వెంకటచంద్ర)

రాజకీయ నేపథ్యం: తండ్రి కాగిత వెంకట్రావు టీడీపీ ఆవిర్భావం నుంచి తుదిశ్వాస విడిచే వరకు పార్టీలో ఉండి అనేక పదవులు చేపట్టారు. తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన కృష్ణ ప్రసాద్ 2019లో పోటీ చేసి ఓడిపోయారు.

నియోజకవర్గం: పామర్రు
అభ్యర్థి పేరు: వర్ల కుమార్ రాజా
విద్యాభ్యాసం: బీటెక్
కులం: ఎస్సీ(మాదిగ)
వయస్సు: 46
భార్య పేరు: విశ్రమ
పిల్లలు: కుమార్తె, కుమారుడు(అలాన జోయల్, రోయస్ యుగంధర్)

రాజకీయ నేపథ్యం: తండ్రి టీడీపీ సీనియర్ నాయకుడు వర్ల రామయ్య. ఆయన రాజకీయ వారసుడిగా 2008లో టీడీపీలో చేరడం ద్వారా రాజకీయ అరంగేట్రం చేశారు. అప్పటి నుంచి పార్టీకి సేవలందిస్తున్నారు.

నియోజకవర్గం: మచిలీపట్నం
అభ్యర్థి పేరు: కొల్లు రవీంద్ర
విద్యాభ్యాసం: బీఏ, ఎల్‌ఎల్‌బీ
కులం: అగ్నికుల క్షత్రియ
వయస్సు: 51
భార్య పేరు: కొల్లు నీలిమ
పిల్లలు: ఇద్దరుకుమారులు (పునీత్ చంద్ర(బీటెక్), కొల్లు నవీన్)

రాజకీయ నేపథ్యం: ప్రముఖ బీసీ నాయకుడు దివంగత నడకుదిటి నరసింహారావుకు రవీంద్ర అల్లుడు. ఆయన ప్రోద్బలంతో రాజకీయాల్లోకి వచ్చిన రవీంద్ర టీడీపీలో డివిజన్ స్థాయి నాయకుడిగా తన ప్రస్థానం ప్రారంభించి అంచెలంచెలుగా రాష్ట్ర నాయకుడిగా ఎదిగారు. 2009లో తొలిసారి మచిలీపట్నం ఎమ్మెల్యేగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 2014లో ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా పనిచేశారు. 2019లో ఓటమిపాలయ్యారు.

నియోజకవర్గం: గన్నవరం
అభ్యర్థి పేరు: యార్లగడ్డ వెంకట్రావు
విద్యాభ్యాసం: బీఎస్సీ(కంప్యూటర్స్), అమెరికాలో ఫస్ట్ ఆబ్జెక్ట్ పేరుతో సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్నారు.
కులం: కమ్మ
కులం: 49
భార్య పేరు: జ్ఞానేశ్వరి
పిల్లలు: కుమార్తె, కుమారుడు(సహస్ర, సహర్షిరామ్)

రాజకీయ నేపథ్యం: రాజకీయాలపై ఆసక్తితో 2019లో గన్నవరం వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా 2 సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో వినూత్న పథకాలతో రైతులకు ఉపయోగపడే విధంగా సేవలందించారు.

నియోజకవర్గం: గుడివాడ
అభ్యర్థి పేరు: వెనిగండ్ల రాము
విద్యాభ్యాసం: బీటెక్(ఈసీఈ), అమెరికాలో ఎపిసెన్స్ సిస్టమ్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వాహకులు
కులం: కమ్మ
వయస్సు: 53
భార్య పేరు: సుఖద(ఎస్సీ-మాల)
పిల్లలు: ఇద్దరు కుమార్తెలు(ప్రణతి, ప్రత్యూష)

రాజకీయ నేపథ్యం: రాజకీయాలపై ఆసక్తితో సొంత ఊరిలో గత కొన్నేళ్లుగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు.

హంసలదీవికి పోటెత్తిన భక్తులు

సింధు స్నానాలు ఆచరించిన 40 వేల మంది



సముద్రతీరంలో గౌరీ వ్రతాలు చేస్తున్న భక్తులు

కోడూరు, ఫిబ్రవరి 24: కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో హంసలదీవి సముద్రతీరం కిటకిటలాడింది. మాఘ పౌర్ణమి సందర్భంగా సింధు స్నానాలు ఆచరించటానికి 40వేల మంది భక్తులు విచ్చేశారు. సముద్ర తీరంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పవిత్ర సంగమ ప్రదేశంలో జల్లుస్నానాలు ఆచరించారు. కృష్ణవేణమ్మ పాదాల వద్ద, బాల ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీ ధర్ పర్యవేక్షణలో అవనిగడ్డ సీఐ త్రినాథ్, ఎస్‌ఐ శిరీ షల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచ్ కొక్కిలిగడ్డ భిక్షాలు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. జనసేన నాయకుడు మాదివాడ వెంకటకృష్ణ 7 వేల మందికి పులిహోర పంపిణీ చేశారు. జనసేన నాయకుడు చిలకలపూడి పాపారావు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు.

సంప్రదాయబద్ధంగా జలబిందెల మహోత్సవం



జలబిందెలు తీసుకుని వస్తున్న భక్తులు

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 24: పెనుగంచిప్రోలు తిరునాళ్లలో రెండో రోజు శనివారం అమ్మవారికి జలబిందెల మహోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానంలో పూజలు నిర్వహించిన ఐదు కుండలను మునేటి వద్దకు ఊరేగింపుగా ప్రధానార్చకుడు మర్రిబోయిన గోపి తీసుకెళ్లి, వాటిని కొత్త నీటితో నింపారు. సంప్రదాయం ప్రకారం కర్ల, సూరంపల్లి, వడ్లముడి, నల్లపునేని, గజ్జి వంశీకులు రామకృష్ణ, ఫణికృష్ణ, భాస్కరరావు, నగేష్, శివకృష్ణలు బిందెలను తలపై ఉంచుకుని దేవస్థానం వరకు మోసుకొచ్చారు. గ్రామస్థులు జలబిందెలకు స్వాగతం పలికి వార పోసి అనుసరించారు. పెనుగంచిప్రోలు ఎస్సై రాంబాబు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లోకి జలబిందెలను తీసుకువెళ్లారు. తెచ్చిన జలబిందెలను దేవస్థానంలోని అంకమ్మ తల్లి ఉపాలయంలో ఉంచారు.

తిరునాళ్లకొచ్చిన వృద్ధురాలు
గుండెపోటుతో మృతి



కుప్పకూలిన ధనలక్ష్మి

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన గుంటూరుజిల్లా తెనాలికి చెందిన వృద్ధురాలు దేశ ధనలక్ష్మి (61) గుండెపోటుతో మృతి చెందింది. బంధువులతో కలిసి వచ్చిన ఆమె శనివారం గుంటూరు వెళ్లేందుకు పోలీస్ స్టేషన్ సెంటర్‌లో బస్సు ఎక్కేందుకు ఆగినప్పుడు ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. 108కు సమాచారం ఇవ్వగా అప్పటికే మృతి చెందినట్టు సిబ్బంది చెప్పారు. ఆమె భౌతికకాయాన్ని బంధువులు తెనాలికి తీసుకెళ్లారు.

గ్రూప్-2 పరీక్షా
కేంద్రాల వద్ద 144 సెక్షన్

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 24: జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించే గ్రూప్-2 స్ర్కీనింగ్ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశామని కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. శనివారం పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తుపై ఎస్పీ వివరించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఇంటర్‌నెట్, జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని, అభ్యర్థులు అరగంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 52 కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షలు రాస్తుండగా, జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో 11 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయన్నారు.

27 నుంచి ఏపీ టెట్ పరీక్షలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 24: కృష్ణాజిల్లాలో మూడు పరీక్షా కేంద్రాల్లో ఈనెల 27 నుంచి మార్చి 6 వరకు ఏపీ టెట్ ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. మచిలీపట్నంలోని డీఎంఎస్ వెంకటేశ్వర ఇంజనీరింగ్, నందమూరు వాసవీ ఇంజనీరింగ్, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సందేహాలుంటే డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ రాంప్రసాద్ 9700882034కు ఫోన్ చేయాలని ఆమె సూచించారు.

ఇంటర్ పరీక్షలు
పకడ్బందీగా నిర్వహించాలి

- కృష్ణాజిల్లా ఇంటర్ బోర్డు ప్రాం తీయ పర్యవేక్షణాధికారి పి.రవికుమార్

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 24: జిల్లాలో మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కృష్ణాజిల్లా ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.రవికుమార్ అన్నారు. శనివారం లేడీయాంప్తిల్ కళాశాలలో పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్లతో పరీక్షలకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 59 పరీక్షా కేంద్రాల్లో మొదటి సంవత్సరం 21,348 మంది, సెకండియర్ 20,161 మంది పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. అరగంట ముందే పరీక్ష హాలులోకి రావాలన్నారు. డీఈసీ పరీక్షల కమిటీ సభ్యులు ప్రసాద శాస్త్రి, రవికిరణ్, వెంకటరమణ, నాగరవి, ప్రిన్సిపాల్ ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నా పేరు ప్రకటించకపోవడం మహదానందం

- సామాజిక మాధ్యమాల్లో మండలి బుద్ధప్రసాద్ ఆవేదనతో పోస్టు
- తొలి జాబితాలో అవనిగడ్డ సీటు ప్రకటించకపోవటంపై కినుక

అవనిగడ్డ, ఫిబ్రవరి 24: టీడీపీ - జనసేన కూటమి తొలి జాబితాలో మచిలీపట్నం పార్లమెంట్‌లో అవనిగడ్డ సీటును ప్రకటించకపోవడంపై మండలి బుద్ధప్రసాద్ ఒకింత అసహనం వ్యక్తంచేశారు. 2019లో టీడీపీ ఓటమి చెందిన నాటి నుంచి నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై పోరాటం చేసిన బుద్ధప్రసాద్ పేరు తొలి జాబితాలో ప్రకటిస్తారని అందరూ భావించారు. కానీ ఆయన పేరు లేకపోవటంతో కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పార్టీ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. దీనిపై బుద్ధప్రసాద్ స్పందించారు. "నా పేరు ప్రకటించనందుకు మహదానందంగా ఉంది. ప్రజల నుంచి వచ్చిన పక్షిలాగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొందినట్లు ఉంది. నేను పదవుల కోసం పుట్టలేదు. పదవులు లభించనప్పుడు ప్రజలకు మేలు చేయటానికి, ఈ ప్రాంత అభివృద్ధికి ప్రయత్నించానే తప్ప పదవులను అడ్డుపెట్టుకుని దోచుకోలేదు, దాచుకోలేదు. రాజకీయాలకు డబ్బు ప్రధానమైంది. ఓటరును కొనుగోలుగా రాజకీయ పక్షాలు భావిస్తున్న ఈ తరుణంలో ధనవంతుల కోసం అన్వేషణలు జరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో నాబోటి వారు ఎన్నికల్లో నిలబడాలని భావించటం సమంజసం కాదు. పరిస్థితులను కార్యకర్తలు, ప్రజలు అర్థం చేసుకోవాలి." అని పార్టీ సోషల్ మీడియా గ్రూపుల్లోనూ, తన వ్యక్తిగత ఫేస్ బుక్ అకౌంట్‌లోనూ ఆయన ఆవేదనతో పోస్టు చేశారు. ఈ పోస్టు నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. అవనిగడ్డ సీటును టీడీపీకి ఇస్తారా? లేక జనసేన పార్టీకి కేటాయించారా? అన్న విషయం అర్థం కాక కార్యకర్తలు, రాజకీయ వర్గాలు అయోమయంలో ఉన్నాయి.

దేవదత్‌ను కలిసిన కొలికపూడి



తిరువూరు, ఫిబ్రవరి 24: ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జి శావల దేవదత్‌ను టీడీపీ తిరువూరు అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం నియోజకవర్గ కార్యాలయంలో ఉన్న తనను కలిసేందుకు వచ్చిన కొలికపూడిని దేవదత్ సాదరరంగా ఆహ్వానించారు. ఇప్పటి వరకు పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించానని, భవిష్యత్‌లో పార్టీకి అవసరమైన సేవలు అందిస్తానని అన్నారు. కొలికపూడిని అభినందించారు.

పెడనలో గెలుపే లక్ష్యం

టికెట్ ఇచ్చినందుకు చంద్రబాబు, పవన్, లోకేశ్‌కు కృతజ్ఞతలు: కాగిత

బంటుమిల్లి, ఫిబ్రవరి 24: టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల సహకారంతో గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని టీడీపీ పెడన నియోజకవర్గ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. నిరంతరం ప్రజలలో ఉంటూ అభివృద్ధే లక్ష్యంగా, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. శనివారం నాగేశ్వరరావుపేటలోని తన ఇంటివద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించినందుకు చంద్రబాబు, పవన్, లోకేశ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ పాలనలో పెడన నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు.





శ్రీకాకుళంలో ఇసుక డంపింగ్ చేస్తున్న ప్రాంతంలో నిరసన తెలుపుతున్న టీడీపీ, జనసేన నేతలు, కొటికలపూడిలో దేవినేని ఉమ, జనసేన నేతలు, తోట్లవల్లూరులో ధర్నా చేస్తున్న టీడీపీ నేతలు

నిరసన వెల్లువ

అనధికార ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా టీడీపీ-జనసేన ఆందోళన

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24: రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతల కనుసన్నల్లో 500కు పైగా రీచ్‌ల్లో ఈసీలు లేకుండా అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేస్తూ రోజుకు 2వేల టన్నుల ఇసుకను తవ్వితీసి టన్ను రూ.475 చొప్పున విక్రయిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడి వద్ద కృష్ణానదిలో ఇసుక అక్రమ తవ్వకాల ప్రాంతంలో టీడీపీ-జనసేన నేతలతో కలిసి శనివారం ఉమా నిరసన తెలిపారు. ఇసుక దందాలో ఎన్టీఆర్ జిల్లా నుంచి తాడేపల్లి ప్యాలెస్‌కు రూ.23 కోట్లు కప్పం చెల్లించిన ఈ ఎమ్మెల్యేలను, మంత్రిని తరిమి కొట్టాలన్నారు. గూగుల్ ఎర్త్‌లో 2021 నుంచి అందుబాటులో ఉన్న శాటిలైట్ చిత్రాలను విశ్లేషిస్తే విజయవాడ గనుల శాఖ ఏడీ జారీ చేసిన లీజు ప్రాంతానికి బయట ఇసుక తవ్వుతున్నట్లు స్పష్టంగా కనిపించిందన్నారు. డిసెంబరు నుంచి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జీసీ కేసీ ప్రాజెక్ట్స్ సంస్థ భారీ యంత్రాలతో ఇసుక తవ్వుతోందని దీనికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత జిల్లా చిత్తూరులో అక్రమ ఇసుక రవాణాపై రూ.18 కోట్ల జరిమానా విధించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జగన్ రెడ్డి ఇసుక దోపిడీకి 130 మంది భవన నిర్మాణ కార్మికులు బలయ్యారన్నారు. ఇసుకలో దోచుకున్న డబ్బుతో ఎన్నికల్లో గెలవాలని జగన్ రెడ్డి కుట్రలు చేస్తున్నాడన్నారు. జంపాల సీతారామయ్య, రామినేని రాజశేఖర్ (రాజ), పల్లె శ్రీనివాసరావు, కోలకాని వెంకట్రావ్, మల్లీడు మంగేశ్వరరావు, రెంటపల్లి వెంకటేశ్వరరావు, యడ్లూరి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఇసుక, బుసక తవ్వకాలు నిలుపుదల చేయాలి

ఘంటసాల: శ్రీకాకుళంలో అనధికార ఇసుక, బుసక తవ్వకాలను నిలుపుదల చేయాలంటూ టీడీపీ, జనసేన పార్టీల నేతలు శనివారం నిరసన తెలిపారు. కరకట్ట వద్ద టీడీపీ కార్యాలయం నుంచి ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు జెండాలు పట్టుకుని ఇసుక అనధికార తవ్వకాలు నిలుపుదల చేయాలంటూ సమీపంలోని ఇసుక డంపింగ్ యార్డు వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. ఇసుక తవ్వకాలపై గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను, సీఆర్‌జెడ్ నిబంధనలను తుంగలో తొక్కారని జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు ఆరోపించారు. యథేచ్ఛగా ఇసుక, బుసక తవ్వకాలు చేస్తున్నా అధికార యంత్రాంగం అధికారపార్టీకి తొత్తుగా వ్యవహరిస్తోందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు విమర్శించారు. శ్రీకాకుళంలో జరిపిన అనధికార తవ్వకాల్లో అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వాటా ఎంతో వెల్లడించాలని ఆయన డిమాండ్‌చేశారు. తవ్వకాలను నిలుపుదల చేయకపోతే ఇరుపార్టీలు ఉమ్మడిగా కార్యాచరణ ప్రకటిస్తాయని హెచ్చరించారు. కృష్ణానదిలో యాంత్రీకరణ ద్వారా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా అధికారులకు తెలియదా? అని టీడీపీ మండలాధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు ప్రశ్నించారు. భూగర్భ జలాలు అడుగంటే అవకాశం ఉందన్నారు. తవ్వకాలకు అనుమతులు చూపాలని తెలుగుయువత రాష్ట్ర నాయకుడు తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్న) డిమాండ్ చేశారు. బండే రాఘవ, ఆత్కూరి నాగరాజు, కోడి శ్రీనివాసరావు, కుంపటి చిట్టిబాబు, పరుచూరి శ్రీనివాసరావు, మేకా శ్రీనివాసరావు, గాజుల శ్రీనివాసరావు, యార్ల శ్రీకాంత్, బాదర్ల లోలాక్షుడు పాల్గొన్నారు.

ఇసుకను పందికొక్కుల్లా మేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే: గురుమూర్తి

తోట్లవల్లూరు: రొయ్యూరులో ఇసుకను సీఎం జగన్ అండదండలతో మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పందికొక్కుల్లా దోచుకుతింటున్నారని టీడీపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకటగురుమూర్తి ఆరోపించారు. రొయ్యూరులో అనధికార ఇసుక దోపిడీని అరికట్టాలని శనివారం తోట్లవల్లూరులో ప్రదర్శన చేసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనధికార మైనింగ్‌ను అరికట్టాల్సిన ప్రభుత్వ శాఖలన్నీ అవినీతితో కూరుకుపోయాయయని గురుమూర్తి అన్నారు. ధర్నా అనంతరం తహసీల్దార్ ఎం.కుసుమకుమారికి వినతి పత్రం అందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, పలు గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

(ఐదో పేజీ తరువాయి)

అర్ధరాత్రి అడ్డగింపు

ఇసుక కొల్లగొడుతున్నారని, తాము ట్రాక్టర్లను తీసేది లేదని నినాదాలు చేశారు. దీంతో నిర్వాహకులు, మంత్రి అనుచరులు ఏమీ చేయలేక క్వారీ నుంచి కరకట్టపైకి చేరుకున్నారు. ప్రభుత్వం తమకు క్వారీ ఇచ్చిందని, అన్నిరకాల అనుమతులు తెచ్చుకున్నామని చెప్పిన నిర్వాహకులు ఆ తర్వాత పలాయనం చిత్తగించారు. శుక్రవారం అర్ధరాత్రి 11 నుంచి శనివారం మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆందోళన చేసినా నిర్వాహకులు అడుగు పెట్టలేదు. 12 గంటల పాటు ఆకలిదప్పులతో అలమటిస్తున్నామని లారీడ్రైవర్లు వేడుకోవటంతో మధ్యాహ్నం 12.30 గంటలకు ఆందోళన విరమించారు. మళ్లీ క్వారీలో తవ్వకాలు జరగకుండా సాయంత్రం వరకు అడ్డుకున్నారు.

అనుమతి పెట్టింది ఒకచోట.. తవ్వేది ఇంకోచోట..

అనుమతి వచ్చిందని తమకు ఓ పత్రం ఇచ్చారని, అందులో ప్రైవేట్ పట్టా భూమి 2.75 ఎకరాల్లో ఇసుక తవ్వకానికి అనుమతి పెట్టి పెద్దపేటిపాయలోని ప్రభుత్వ భూముల్లో భారీగా తవ్వుతున్నారని మోర్ల రాంబాబు, లుక్కా నాగబాబు పేర్కొన్నారు. రొయ్యూరు రహదారిని బాగుచేయటంతో పాటు కార్మికులకు ఇసుక లోడింగ్ పని కల్పించి ఉపాధి చూపాలని డిమాండ్ చేశారు.

రొయ్యూరులో అక్రమ క్వారీ..మంత్రి అనుచరుల మరో దోపిడీ

మంత్రి జోగి రమేశ్ అనుచరులు రొయ్యూరులో శనివారం ఒక ప్రైవేట్ క్వారీని అక్రమంగా తెరిచారు. రైతుల పట్టా భూముల్లో గ్రావెల్‌తో దారి నిర్మించి ఇసుక తవ్వకాలు మొదలుపెట్టారు. అయితే, పాత క్వారీ వద్ద శనివారం గ్రామస్థులు ఆందోళన చేపట్టడంతో దీనిని కూడా తాత్కాలికంగా ఆపారు. కోలవెన్నుకు చెందిన ఓ వ్యక్తితో ఈ ప్రైవేట్ క్వారీకి అనుమతి పెట్టించి, ఇంకా అనుమతి రాకుండానే క్వారీని తెరిచేశారు. దీనిపై తహసీల్దార్ ఎం.కుసుమకుమారి వివరణ ఇస్తూ రొయ్యూరులో పట్టా భూముల్లో ఇసుక తవ్వకానికి కలెక్టర్‌కు దరఖాస్తు చేశారని, ఇంకా ఎలాంటి అనుమతి రాలేదన్నారు.



గనిఆత్కూరులో లారీలను అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు

20 లారీలు పోలీసులకు అప్పగింత

కంచికచర్ల: అనుమతులు లేకుండా కృష్ణానది రీచ్‌ల నుంచి ఇసుక తవ్వి, హైదరాబాద్ తరలిస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. గనిఆత్కూరు, చెవిటికల్లు, మున్నలూరు రీచ్‌ల వద్ద టీడీపీ శ్రేణులు శుక్రవారం రాత్రి ఆందోళనకు దిగాయి. రీచ్‌ల నుంచి బయటకు వస్తున్న ఇసుక లారీలను అడ్డగించాయి. మూడు రీచ్‌ల వద్ద 20కి పైగా ఇసుక లారీలను అడ్డగించి, పోలీసులకు అప్పగించాయి. కలెక్టర్ తక్షణమే స్పందించాలని కోరారు. గనిఆత్కూరులో ఉపసర్పంచ్ మూరకొండ ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యుడు వెంపరాల వెంకటేశ్వరరావు, గుదే నరేష్, షేక్ సైదా ఆందోళనలో పాల్గొన్నారు. వేబిల్లులు సక్రమంగా ఉన్నాయని పదికి పైగా లారీలను పోలీసులు విడిచిపెట్టారు. అధిక లోడ్ పేరుతో కేసులు నమోదు చేసి, ఎనిమిది లారీలను మార్కెట్‌యార్డుకు తరలించారు.

నా కుమార్తె బాధితురాలు

- నిందితురాలు కాదు
- యూనియన్ బ్యాంక్ మాజీ మేనేజర్ ప్రభావతి తండ్రి వెంకటరంగారావు

విజయవాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తన కుమార్తె నిందితురాలు కాదని, ఓ వ్యక్తి చేసిన మోసంలో బాధితురాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గంగూరు బ్రాంచ్ మాజీ మేనేజర్ దావులూరి ప్రభావతి తండ్రి వెంకటరంగారావు తెలిపారు. ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభావతికి కాట్రగడ్డ విజయకృష్ణతో 2020లో వివాహమైందని, భార్యాభర్త లిద్దరి మధ్య కొంతకాలంగా వివాదాలు ఉన్నాయని తెలిపారు. వాటిని పరిష్కరిస్తానని చెప్పి తమకు దూరపు బంధువైన కవులూరి యోగేశ్వరరావు ఆమె వద్దకు వచ్చాడని పేర్కొన్నారు. కొన్నిరోజుల తర్వాత తనకు డబ్బు అవసరం ఉందని అప్పు అడిగితే ప్రభావతి తన వద్ద ఉన్న బంగారం ఇచ్చిందని తెలిపారు. యోగేశ్వరరావు దీన్ని తిరిగి ఇవ్వకుండా, ఆమె పనిచేస్తున్న బ్యాంకులోనే తాకట్టు పెట్టాడని వివరించారు. తర్వాత ప్రభావతితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని తెలిపారు.

శనగలు క్వింటాలు రూ.5,440

వన్‌టౌన్, ఫిబ్రవరి 24: ఎన్టీఆర్ జిల్లాలో 2023-2024లో పండించిన శనగలను క్వింటాల్‌కు రూ.5,440 చొప్పున మద్దతు ధరతో ఆర్బీకేల్లో కొనుగోలు చేస్తారని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ-క్రాప్‌లో ఇప్పటికే నమోదు చేసుకున్న రైతులు వాటిని అమ్మదలిస్తే సమీపంలోని ఆర్బీకేలకు వెళ్లి పేర్లను సీఎం యాప్‌లో ఈనెల 27వ తేదీ నుంచి నమోదు చేయించుకోవాలని సూచించారు.

ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాల సమావేశాలు టీ, బిస్కెట్లకే పరిమితం

- ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 24: "ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ సంఘాల నాయకులతో మైండ్ గేమ్ ఆడుకుంది. ఉద్యోగ సంఘాలతో సమావేశాలు కేవలం టీ, బిస్కట్లకే పరిమితమైపోయాయి. ఎవరికీ ఏ విధమైన లబ్ధి చేకూరలేదు." అని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు అన్నారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ సంఘాల్లో ఉద్యమ స్ఫూర్తి, పోరాట పటిమ, ఐక్యత కొరవడుతోందన్నారు. ఉద్యోగ సంఘ నాయకులను విభజించి పాలించడం వల్ల ఉద్యమం పలుచబడుతోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకుల జేఏసీగా ఏర్పడి ఉమ్మడి పోరాటం చేయాలన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	308
చికెన్ స్కిన్‌లెస్	316



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15

ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారానికి ముందస్తు అనుమతి తీసుకోవాలి

మచిలీపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికలకు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ పార్టీలు ప్రకటనలు జారీ చేసేందుకు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు తెలిపారు. జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)ని నియమిస్తూ శనివారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ ఏఆర్‌వో కె.చంద్రశేఖరరావు, కేంద్ర ప్రసార భారతి సీనియర్ రిపోర్టర్ కె.నవీన్, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ క్షేత్ర ప్రచార అధికారి ఆర్ రమేష్‌చంద్ర, దూరదర్శన్ రిపోర్టర్ ఎస్.సునీల్, డీపీఆర్వో ఎం.వెంకటేశ్వరప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



26వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న వెనిగండ్ల రాము

బాబు ష్యూరిటీ కార్యక్రమంలో వెనిగండ్ల

గుడివాడ : నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో గుడివాడలోని 22, 26 వార్డుల్లో శనివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వెనిగండ్ల రాము వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గజమాలతో వెనిగండ్లకు స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మజ్జి శ్రీనివాసరావు, లింగం ప్రసాద్, ముళ్ళపూడి రమేష్, వాసే మురళీ, పోలాసి ఉమయ్య, రాధాకృష్ణ, కంచనపల్లి సుబ్రహ్మణ్యం, లింగం చిట్టిబాబు, కంచర్ల సుధాకర్, గుత్తా చంటి, మోజెస్, సయ్యద్ జబీన్, వేశపోగు ఇమ్మానియేలు, సత్యసాయి, సూరిబాబు, కోడూరు ప్రభు, భవాని శంకర్, రఫీ, గుడివాడ జోన్స్, కొడాలి బాలు, అజిత్ చౌదరి, జానీ షరీఫ్, సైదులు, రాహుల్, కనకారావు, గోపాల కృష్ణ, దేవేంద్రుడు, తులసీరాణి, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న కాగిత కృష్ణప్రసాద్

షా అబ్దుల్లాపాలెంలో టీడీపీలో చేరికలు

పెడన, ఫిబ్రవరి 24 : గూడూరు మండలం షా అబ్దుల్లాపాలెం గ్రామంలో వైసీపీ నాయకుడు కేశన వాసు ఆధ్వర్యంలో 15 కుటుంబాలు పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. వారికి కృష్ణప్రసాద్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సాదరబోయిన ఏడుకొండలు, పోతన స్వామి, గోపీ నాగబాబు, ఎస్‌ఏ బేగ్, కాసగాని శ్రీనివాసరావు, హమీదుల్లా తదితర దేశం నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీగా బందరు చేరుకున్న రవీంద్రకు ఘనస్వాగతం పలుకుతున్న కార్యకర్తలు



కొల్లు రవీంద్రకు టికెట్ ప్రకటించిన నేపథ్యంలో టీడీపీ నేతల సంఘీభావం



కాగితకు అభినందనలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

కొల్లు రవీంద్రకు టీడీపీ శ్రేణుల ఘనస్వాగతం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 24 : మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కొల్లు రవీంద్రను పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఈ నేపథ్యంలో టీడీపీ కార్యాలయం నుంచి బందరు విచ్చేసిన రవీంద్రకు శనివారం రాత్రి 9.30 గంటలకు సుల్తానగరం వద్ద నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. వేలాది మంది కార్యకర్తలు పార్టీ జెండాలతో ర్యాలీగా వచ్చి స్వాగతం పలికారు. రవీంద్ర సుల్తానగరం ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ర్యాలీగా నగరంలోకి వచ్చారు. నగర టీడీపీ అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు, రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే నానిలతో పాటు టీడీపీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మూడు స్తంభాల సెంటర్, చల్లరస్తా సెంటర్, కోనేరుసెంటర్, బస్టాండ్ సెంటర్‌ల వద్ద కొల్లు రవీంద్రను పూలమాలలతో ముంచెత్తారు. అడుగడుగునా బాణాసంచా కాలుస్తూ సందడి చేశారు.



మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు గోపీచంద్

రవీంద్ర విజయం నల్లేరు మీద నడకే

మచిలీపట్నం టౌన్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లు రవీంద్ర విజయం నల్లేరు మీద నడకే తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. శనివారం మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్రకు మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ టీడీపీ అభ్యర్థిగా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించినందుకు గోపు సత్యనారాయణతో పాటు బందరు రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు కుంచే నాని, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్, జిల్లా టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఖాజా, టీడీపీ సీనియర్ నాయకుడు వాలిశెట్టి తిరుమల రావు తదితరులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. కేక్ కట్ చేసి గోపు సత్యనారాయణ మాట్లాడారు. కొల్లు రవీంద్రకు టికెట్ ఇవ్వడం ముదావహమని టీడీపీ కార్పొరేటర్, సూర్యబలిజ బీసీ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ చిత్రజల్లు నాగరాము అన్నారు. కొల్లు రవీంద్రకు టికెట్ ఇవ్వడం పట్ల నాగరాము హర్షం వ్యక్తం టీడీపీ, జనసేన పొత్తుతో ప్రజాదరణ ఉన్న అభ్యర్థులకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ టికెట్లు ఇచ్చారని, దీని వల్ల పెద్ద ఎత్తున పెద్ద మెజారిటీతో అభ్యర్థులు గెలుపొందుతారని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. టీడీపీ నాయకులు పి.వి. ఫణికుమార్, గంజాల రవికుమార్, జి. కృష్ణమూర్తి, సయ్యద్ అబ్బాస్, పండరీనాథ్, కోమటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెనిగండ్ల రాముకు టికెట్‌పై హర్షం

గుడివాడ : గుడివాడ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా వెనిగండ్ల రామును ప్రకటించడం పట్ల మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు. తనను అభిమానిస్తూ, ప్రత్యేక శ్రద్ధతో ముం దుకు తీసుకువెళుతున్న మాజీ ఎమ్మెల్యే రావికి వెనిగండ్ల రాము కృతజ్ఞతలు తెలిపారు. గుడివాడలో 20 ఏళ్లుగా పాతుకుపోయిన దుర్మార్గుడికి గుణపాఠం చెప్పేందుకు టీడీపీ, జనసేన కార్యకర్తల ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.

కాగిత అభిమానుల సంబరాలు

పెడన/బంటుమిల్లి : పెడన నియోజకవర్గ టీడీపీ టికెట్‌ను కాగిత కృష్ణప్రసాద్‌కు కేటాయించడంతో పార్టీ శ్రేణులు శనివారం సంబరాలు జరుపుకున్నాయి. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. కృష్ణప్రసాద్‌కు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఆయనను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు.

ఉప్పాల విగ్రహం ఏర్పాటుకు టీడీపీ అభ్యంతరం

- కౌన్సిల్ సమావేశంలో డిసెంట్
- అజెండాలోని 27 అంశాలకు ఆమోదం

పెడన, ఫిబ్రవరి 24 : పెడన మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో అజెండాలోని 27 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అయితే, బంటుమిల్లి రోడ్డుసెంటర్‌లో ఉప్పాల రామ్‌ప్రసాద్ విగ్రహం ఏర్పాటుకు సంబంధించిన అంశంపై 14వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అనుముల నాగమల్లేశ్వరమ్మ అభ్యంతరం వ్యక్తం చేసి, డిసెంట్ ఇచ్చారు. వైసీపీకి చెందిన మాజీ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్ డిసెంట్ తీసుకోవద్దని, దానిని పక్కన పడేయాలని అధికారులను ఆదేశించారు. అయిన దానికి కాని దానికి డిసెంట్ ఇవ్వడం పరిపాటిగా మారిందని అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంపై 12వ వార్డు జనసేన పార్టీ కౌన్సిలర్ మట్టా శివపావని మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అంశాలను వ్యతిరేకిస్తూ డిసెంట్ ఇచ్చే హక్కు సభ్యులకు ఉందని వాదించారు. డిసెంట్ ఇవ్వొద్దనే అధికారం ఎవరికీ లేదన్నారు. శివపావని, కటకం ప్రసాద్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. శివపావని మాట్లాడుతుండగానే వైసీపీ కౌన్సిలర్లందరూ లేచి వెళ్ళిపోవడంతో సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. ఇన్‌చార్జి కమిషనర్ ఏసుబాబు, మేనేజర్ వాసా యోగేశ్వ రరావు, ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావు, ఏఈ రామాంజనేయులు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.



అధ్వాన రోడ్లు వైసీపీ పాలకులకు కన్పించడం లేదా : బండి ధ్వజం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 24 : మచిలీపట్నం నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న వైసీపీ పాలకులకు అధ్వానంగా ఉన్న రుస్తుంబాద రోడ్లు కన్పించడం లేదా అని జనసేన మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ప్రశ్నించారు. శనివారం రుస్తుంబాదలోని మునిసిపల్ ప్రధాన పార్కు వెనుక ఉన్న వై జంక్షన్‌లో బండి రామకృష్ణతో పాటు జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, డివిజన్ ఇన్‌చార్జి చలమలశెట్టి రమేష్, వంపుగడల చౌదరి, మహమ్మద్ సమీర్ తదితరులు పర్యటించారు. ఆ ప్రాంత ప్రజలు సమస్యలను రామకృష్ణకు తెలిపారు. కల్వర్టులు శిథిల మయ్యాయని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, రోడ్ల మీద మురుగునీరు ప్రవహిస్తోందన్నారు. సమస్యలపై పాలకులు దృష్టి సారించకుండా కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

గుడివాడ : లోక్ అదాలత్ ద్వారానే కేసులు సత్వర పరిష్కారమవుతాయని, కక్షిదారులకు డబ్బు, సమయం కూడా ఆదా అవుతుందని న్యాయాధికారులు పూర్ణిమ, గాయత్రి, నాగలక్ష్మి అన్నారు. గుడివాడ కోర్టు భవనాల సముదాయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో పరిష్కారమైన కేసులు తిరిగి మరో కోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం లేదన్నారు. మార్చి 9వ తేదీన శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు తుమ్మలచర్ల శ్రీనివాసరావు, లోక్‌అదాలత్ కమిటీ సభ్యులు రహంతుల్లా, చోరగుడి కుటుంబరావు, మహ్మద్ రఫీ, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ గోదాములు ప్రారంభం

నాగాయలంక : నాగాయలంక, ఎదురుమొండి గ్రామాల్లో రూ.57.80 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ గోదాములను కేడీసీసీబీ ఛైర్‌పర్సన్ పద్మావతి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శనివారం ప్రారంభించారు. అధ్యక్షుడు కన్నా రామ్మోహనరావు, వెంకట సాంబశివరావు, ఏఎంసీ ఛైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, బ్యాంక్ మేనేజర్ చింతలపూడి మధు పాల్గొన్నారు.

ఈవీఎంల కేటాయింపులో జాగ్రత్తలు తీసుకోవాలి

మచిలీపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల విధుల నిమిత్తం నియమితులైన అధికారులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండి, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈవీఎంల విషయమై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఈవీఎంల జిల్లా నోడల్ అధికారి, డీపీవో నాగేశ్వరనాయక్ అన్నారు. కలెక్టరేట్ సమావేశపుహాలులో ఈవీఎంల కేటాయింపుపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహనా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మొదటి విడతలో అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లను రాజకీయపార్టీల నాయకుల ఆధ్వర్యంలో కేటాయిస్తామన్నారు. రెండో విడతలో ఈవీఎంలను ఆయా నియోజకవర్గాలకు పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయిస్తామని తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గానికి ఈవీఎంలను జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణలో రాజకీయపార్టీల నాయకుల సమక్షంలో కేటాయిస్తామన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు సంబంధించి ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్‌లకు ప్రత్యేకంగా క్యూ ఆర్‌కోడ్ ఉంటుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 20 శాతం అధికంగా ఈవీఎంలను రిజర్వు చేసి అందుబాటులో ఉంచుతామన్నారు. జేసీ గీతాంజలి శర్మ, మచిలీపట్నం, ఉయ్యూరు గుడివాడ ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.



బుట్టాయిపేటలో శ్రీచక్రార్చన నిర్వహిస్తున్న దత్త విజయానంద స్వామీజీ

భగవద్గీత మహోన్నతం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 24 : భగవద్గీతలో మానవుల మనుగడకు సంబంధించిన ఎన్నో సామాజిక, ఆధ్యాత్మిక అంశాలు దాగి ఉన్నాయని మైసూరు దత్తపీఠం ఉత్తరాధిపతి దత్త విజయానంద స్వామీజీ అన్నారు. బుట్టాయిపేట దత్తాశ్రమంలో మాఘ పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్య నారాయణ వ్రతాలు నిర్వహించారు. దివ్యనామ సంకీర్తన గానం చేశారు. శ్రీ చక్రార్చన జరిపారు. భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. మచిలీపట్నం ఆధ్యాత్మిక కేంద్రంగా పరిఢవిల్లుతోందని, ధర్మాన్ని పరిరక్షించేందుకు భక్తులు ముందుకు రావాలన్నారు. అనంతరం ఆదర్శ విద్యాపీఠంలో గణపతి దేవాలయంలో మహాకుంభాభిషేక కార్యక్రమంలో స్వామిజీ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

కోడూరు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి హంసలదీవిలో వేణుగోపాలస్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్య అవధాని పర్యవేక్షణలో మంగళవాయిద్యాల మధ్య వేదపండితులు కన్నుల పండువగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి తిలకించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



హంసలదీవిలో వేణుగోపాలస్వామి కల్యాణం



మొవ్వలో పవళింపు సేవ

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కూచిపూడి : మొవ్వలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిత్య హోమం, బలిహరణ, చతుర్ధ కలశ స్నపన, చక్రస్నానం, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పయాగం, ధ్వజారోహణ, పవళింపు సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దివి భక్తులు అయోధ్య సందర్శన

అవనిగడ్డ రూరల్ : అవనిగడ్డ నియోజకవర్గంలోని మోదుమూడి, వి.కొత్తపాలెం, అశ్వారావుపాలెం, మాచవరం, రామచంద్రపురం గ్రామాలకు చెందిన 60 మంది భక్తులు అయోధ్య వెళ్లి రామమందిరాన్ని దర్శించుకున్నారు. అయోధ్య రామమందిరం దర్శించుకోవటం ఎంతో సంతోషంగా ఉందని భక్తులు పేర్కొన్నారు.



రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

గుడివాడ : చిన్నకార్ల స్టాండ్ వద్ద రూ.83లక్షలు, గుడ్‌మెన్‌పేటలోని వాటర్ ట్యాంకు వద్ద రూ.82 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం వైసీపీ నేతలు గొర్ల శ్రీను, మండలి హనుమంతరావు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ ఎంఈ విజయదుర్గా, డీఈలు ప్రవీణ్, నాయకులు రావులకొల్లు హైమావతి, సుబ్రహ్మణ్యం, మల్లేశ్వరరావు, ఎలీషా, రాజేష్, మలిరెడ్డి రవి, పాలేటి చంటి, వెంపటి సైమన్, రేమల్లి నీలాకాంత్, షేక్ బాబ్జీ, చుండూరి శేఖర్, చింతల భాస్కరరావు, వీరిశెట్టి నరసింహారావు, గంధం సైమన్‌బాబు, మూడెడ్ల ఉమా, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

పోతురాజు స్వామి జాతర ప్రారంభం

నాగాయలంక : పోతురాజు స్వా మి సంబరాన్ని శనివారం ప్రారంభించారు. ఆనవాయితీ ప్రకారం దేవరగుడిలో ఘటాలను బయటకు తెచ్చి ఊరేగింపుగా తీసుకెళ్లి కృష్ణానదిలో శుద్ధి చేసి పూజలు నిర్వహించి, టీడీపీ కల్యాణ మంటపం సమీపంలోని జల్దిలో ఉంచారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.



ఎన్నారై దంపతులు సైకిళ్ల వితరణ

చల్లపల్లి : యార్లగడ్డకు చెందిన ఎన్నారైలు ఎస్. కుమార్, అనిత దంపతులు కుమార్తె భూమి మొదటి పుట్టినరోజు సందర్భం గా రూ.3.50 లక్షలతో 50 సైకిళ్లు చల్లపల్లి రాజా హైస్కూల్ విద్యార్థులకు అందజేశారు. అర్జా వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం ఎస్.సుదర్శన ప్రసాద్, ఇన్‌చార్జి రేణుప్రసాద్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

లేగదూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

చల్లపల్లి : లేగదూడల పెంపకం పట్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా ఉపసం చాలకులు డాక్టర్ కె.శ్రీనివాసరావు సూచించారు. యార్లగడ్డలో శనివారం లేగదూడల అందాల పోటీలు, పశు కృత్రిమ గర్భధారణ కార్యక్రమం నిర్వహించారు. విజేతలకు బహు మతులు అందజేశారు. పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ డి.శ్రీనివాసరావు, డీడీ డాక్టర్ నాగభూషణబాబు, ఏడీఏ డాక్టర్ నల్లూరి వెంకట భార్గవ, పశువైద్యాధికారులు డాక్టర్ పి.మనోజ్, డాక్టర్ ఎం.నందకిషోర్ వైద్యులు పాల్గొన్నారు.

అన్నదానం, పుస్తకాల పంపిణీ

గుడ్లవల్లేరు : ఘంటా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు 120 మంది పేదలకు అన్నదానం చేశారు. శ్రీ సాయి విద్యా నికేతన్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిల్స్ పంపిణీ నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొర్రా నాగేశ్వరరావు, కోశాధికారి మేరుగు పెరు మాళ్ళు, మాజీ అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ, వి.వి. సుబ్బారావు చౌదరి, జంగం మోహనరావు, వై.పి.సి ప్రసాద్, సూరపనేని పరందామయ్య, వల్లభనేని రవీంద్ర, పోలవరపు వెంకటరావు, చాపరాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ శాఖ కార్యాలయం ప్రారంభం

చల్లపల్లి : మండల కార్యాలయాల ప్రాంగణంలో రూ.19.98 లక్షలతో నిర్మించిన స్పెషల్ డ్రైనేజీ శాఖ సబ్ డివిజన్ కార్యా లయాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు శనివారం ప్రారంభించారు.

సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైసీపీ రైతువిభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, సింహాద్రి వికాస్, డ్రైనేజీ శాఖ ఈఈ ఆర్.విజయలక్ష్మి, స్థానిక అధికారులు వెంకటేశ్వరరావు, చిరంజీవి, రాంకుమార్, ప్రజా ప్రతినిధులు మోపిదేవి ద్వారకానాథ్, వల్లూరు ఉమ, సొసైటీ ఛైర్‌పర్సన్‌లు శీరం నాని, పాగోలు ఫణి పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి

ఉయ్యూరు, ఫిబ్రవరి 24 : మార్చి 9న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో సామ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించాలని ఉయ్యూరు న్యాయాధికారి కె శ్రీహరి అధికారులను కోరారు. జాతీయ లోక్‌అదాలత్‌పై శనివారం కోర్టులో పోలీసులతో సమీక్షించారు. ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా, పట్టణ ఎస్సై గణేశ్‌కుమార్, రూరల్ ఎస్సై అవినాశ్, తోట్లవల్లూరు, పమిడిముక్కల ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీహరి

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పెనమలూరు, ఫిబ్రవరి 24 : యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి, పార్వతీదేవి అమ్మవారికి రుద్రహోమం, పూర్ణాహుతి, మండప ఉద్వాసన, పరివార దేవతల సంప్రోక్షణ, నీరాజన మంత్రపుష్పాలు తదితర కార్యక్రమాలను అర్చకులు సాగర్ అత్యంత వేడుకగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహరావు, ఈడ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 24 : వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని, మోటారు వాహన చట్టం నిబంధనల ప్రకారం అన్ని రకాల ధ్రువ పత్రాలు లేకుండా వాహనం నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై-2 పి.అర్జమ్మ వాహనదారులను హెచ్చరించారు. శనివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎస్సై వాహన తనిఖీలు నిర్వహించారు. ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎంవీ యాక్టు నిబంధనలు ఉల్లంఘించిన పదిమందికి జరిమాన విధించినట్లు ఎస్సై అర్జమ్మ తెలిపారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అంకమ్మతల్లి ఉత్సవాలు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 24 : బిళ్లనపల్లిలో అంకమ్మతల్లి ఉత్సవాలు శనివారం ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా మొక్కులు చెల్లించడంతో ముగిశాయి. అర్చకులు వేణుశర్మ ఆధ్వర్యంలో అభిషేకపూజలనంతరం ప్రత్యేక అలంకరణతో భక్తులకు అంకమ్మతల్లి దర్శనమిచ్చారు. కొండపావులూరి వంశస్థులు పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కుబడులు చెల్లించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు కొండపావులూరి వెంకట బాబూరావు, తులసీరాం ప్రసాద్, హేమంత్‌కుమార్, మోహన్ కుమార్ పర్యవేక్షణలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. మడిచర్లకు చెందిన కొండ పావులూరి రమేష్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెలుగు యువత నాయకులపై దాడులు అన్యాయం

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 24 : బాపులపాడు గ్రామ తెలుగు యువత అధ్యక్షుడు చెరుకూరి హరికృష్ణపై దాడి చేసిన వైసీపీ కార్యకర్తలైన గూడవల్లి జగదీష్, గూడవల్లి సత్యనారాయణలను టీడీపీ సభ్యులుగా చిత్రీకరించి, సోషల్ మీడియాలో వివాదాన్ని తెలుగుదేశం పార్టీకి అపాదించి దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని టీడీపీ హనుమాన్‌జంక్షన్ పట్టణ అధ్యక్షుడు ఆట్లూరి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. వైసీపీ నాయకులతో తిరుగుతూ, తెలుగు యువత నాయకులపై భౌతిక దాడులకు పాల్పడడం అన్యాయమని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండ పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

ఈడుపుగల్లు (కంకిపాడు), ఫిబ్రవరి 24 : మం డలంలోని ఈడుపుగల్లు గ్రామ పరిధిలో బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కంకి పాడు ఎస్సై డి.సందీప్ తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ, ఈడుపుగల్లుకు చెందిన షేక్ మస్తాన్ వలి గత కొంత కాలం గా బెల్టుషాపు నిర్వహిస్తున్నాడని, సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి, 10 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొన్నామ న్నారు. మండలంలోని మద్యం అక్రమ విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం ఉంటే తక్షణం కంకిపాడు పోలీసుస్టేషన్‌లో పిర్యాదు చేయాలని కోరారు. షేక్ మస్తాన్‌వలిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

నియంత పాలనకు చరమగీతం

టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ

ఉంగుటూరు, ఫిబ్రవరి 24 : రానున్న ఎన్నికల్లో టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించటం ద్వారా వైసీపీ ప్రభుత్వ నియంత పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని చాగంటిపాడు, నందమూరు గ్రామాల్లో శనివారం గ్రామ పార్టీ కమిటీల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యార్లగడ్డ ఆయా గ్రామాల్లో ప్రతి గడపకు వెళ్లి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేసే ఆరు పథకాల గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా గ్రామాల్లో వున్న సమస్యలను అడిగి తెలుసుకుని టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయా సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా యువతకు ఉపాధి కల్పనలో వైసీపీ ప్రభుత్వం విఫలమైదన్నారు.

మట్టిమాఫియాలో మొదటిస్థానం

మట్టిమాఫియాలో రాష్ట్రంలోనే గన్నవరం నియోజకవర్గం మొదటిస్థానంలో వుందని యార్లగడ్డ విమర్శించారు. అధికారపార్టీ నాయకులు ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ గ్రామాల్లో వున్న చెరువులు, వాగులు, వంకలను వదలకుండా అక్రమ మట్టి తవ్వకాలు నిర్వహిస్తూ అందినంత దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలకోసం పేదప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ నియంత పరిపాలన కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి, ఆళ్ల హనోక్, జనసేన పార్టీ అధ్యక్షుడు బర్మా భాస్కర్, మండవ రమ్య, మేడేపల్లి రమా, షేక్ అహ్మద్ ఫకీర్, గుడ్డేటి పోతురాజు, సుంకర రమేష్, మండవ ప్రసాద్, సాయిబాబు, సుంకర శ్రీను, అనగాని సురేష్, జంపా నాగమల్లేశ్వరరావు, పసుపులేటి సుబ్బారావు, జంపా నాగరమేష్ సోమిశెట్టి లక్ష్మణస్వామి, పసుపులేటి లక్ష్మీనారాయణ, జంపా మహేష్, పసుపులేటి కిషోర్, గుండప నేని నాని, మున్నా, రామకృష్ణ, గోగినేని విష్ణు, కొలుసు రవీంద్ర, ఇందుపల్లి శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



నందమూరులో మహిళల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న యార్లగడ్డ వెంకట్రావు

పొణుకుమాడులో పూజలు

మండల పరిధిలోని పొణుకుమాడులో గంగాపార్వతీ సమేత రాజేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో జీవధ్వజస్తంభ పునఃప్రతిష్టాపన వేడుకల్లో యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన హోమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు స్వర్ణ నాంచారేశ్వరశర్మ స్వామివారి శేషవస్త్రంతోపాటు దివ్య ఆశీర్వచనాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి, ఆళ్ల హనోక్, షేక్ అహ్మద్ ఫకీర్, కె.సాంబయ్య, ఆళ్ల సత్యనారాయణ, జోషి కుమార్, మాజీ సర్పంచ్ గుండపనేని నాని, మున్నా, రామకృష్ణ, తేలు సత్యనారాయణ, చల్లగుళ్ల షణ్ముఖ్, పసుమర్తి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

యార్లగడ్డ విజయానికి సమన్వయంతో కృషి చేయాలి: ఆళ్ల

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సంయుక్తంగా ప్రకటించిన మొదటి జాబితాలో గన్నవరానికి ప్రాధాన్యతనిచ్చి యార్లగడ్డ వెంకట్రావు పేరును ప్రకటించడంపట్ల కృతజ్ఞతలు తెలియజేస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా సమన్వయంతో కృషి చేసి యార్లగడ్డ వెంకట్రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. ఆనవాయితీ ప్రకారం అభయాంజనేయస్వామి పూజలనంతరం వీరవల్లి వచ్చిన టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు రైతు నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలోలంక సురేంద్ర మోహనబెనర్జీ, గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, కలపాల సూర్యనారాయణ, పుట్టా సురేష్, ఎంపీటీసీలు పుసులూరి లక్ష్మీనారాయణ, అమృతపల్లి సూర్యనారాయణ, పిల్లా రామారావు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బోడె ప్రసాద్



యనమలకుదురులో టీడీపీ మేనిఫెస్టోను ప్రచారం చేస్తున్న బోడె హేమ

అందుబాటులో ఉంటా.. ఆదరించండి

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

మద్దూరు (కంకిపాడు), ఫిబ్రవరి 24 : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను ఆదరించాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు మండలంలోని మద్దూరుకు చెందిన వైసీపీ నాయకులు ఆరేపల్లి రవి కుటుంబ సభ్యులు, వైసీపీ వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో బోడె ప్రసాద్ సమక్షంలో శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, అధికారంలో ఉన్న ఐదేళ్లు.. ప్రతిపక్షంలో ఉన్న ఐదేళ్లు నియోజకవర్గ ప్రజలకు అందు బాటులో ఉంటూ వచ్చానన్నారు. వలస వచ్చిన ప్రతిపక్ష పార్టీ నాయకులను నమ్మి మోసపోవద్దన్నారు. తనను గెలిపించిన ఏడాది లోపే మద్దూరు - ఉప్పలూరు ప్రధాన రహదారి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో డ్రెయినేజీ ప్రధాన రహదారుల అభివృద్ధి కూడా చేసి చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొంది శివరామకృష్ణ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, యనమదల మదన్ మోహన్, యనమదల చిన్ని, వల్లభనేని నవీన్, వీరంకి బాలకృష్ణ, మన్నే వాసు, మాజీ సర్పంచ్ వల్లే నరసింహారావు, తీట్ల మధు, పామర్తి నాని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని బలపరచండి

పెనమలూరు : ఐదేళ్లుగా అభివృద్ధిలో వెనుకబడిన రాష్ట్రాన్ని బాగుచేసుకోవడానికి వచ్చే ఎన్నికల్లో టీడీపీని బలపరచమని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి హేమ పిలుపునిచ్చారు. శనివారం యనమలకుదురులో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె స్థానిక నాయకులతో కలిసి ప్రజలతో మాట్లాడారు. అవినీతి, నిరుద్యోగం, రైతుల, కార్మికుల ఆత్మహత్యలు జగన్‌రెడ్డి హయాంలో ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ జనసేన మేనిఫెస్టో వల్ల రాష్ట్ర ప్రజలకు అత్యంత ఎక్కువ మేలు జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అనంతనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్, ఇబ్రహీం, తమ్ము అశోక్, బలగం నాగరాజు, గోగినేని రామారావు, ధనేకుల షణ్ముఖరావు, బలగం కొండ, పండల రజిని, కందుల శివ, మల్లంపాటి విజయలక్ష్మి, బూక్యా బిచాలి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కుటుంబ సభ్యులకు అండగా ఉంటా

రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్



మాజీ ఎంపీటీసీ రమణమ్మను పరామర్శిస్తున్న వైవీబీ రాజేంద్రప్రసాద్

ఉప్పలూరు (కంకిపాడు), ఫిబ్రవరి 24 : ఆపదలో ఉన్న తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.వి.బి. రాజేంద్రప్రసాద్ అన్నారు. కంకిపాడు మండలంలోని ఉప్పలూరు మాజీ ఎంపీటీసీ పడవల రమణమ్మను శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి నిబద్ధత కలిగిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారన్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న రమణమ్మ త్వరి తగతిన కోలుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పడవల మధుసూదనరావు, జంపన వీర శ్రీనివాస్, సయ్యద్ అజ్మతుల్లా, చలసాని రాధాకృష్ణమూర్తి, అన్నే మురళీకృష్ణ, లాం చిన్న, ఇజ్రాయిల్, దామెర్ల గురుమూర్తి, విజయకుమార్, లాం శ్రీనివాసరావు, ఉప్పలూరి నాగేశ్వరరావు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ఎనికేపాడు(గన్నవరం), ఫిబ్రవరి 24 : పరిశోధనలతోనే విద్యార్థులకు ఉజ్వ ల భవిష్యత్ ఉంటుందని డాక్టర్ సురేశ్ వి.చెన్నుపాటి అన్నారు. ఎనికేపా డులోని ఎస్ఆర్‌కే ఫౌండేషన్ వారి విజయ మహిళ ఫార్మసీ కళాశాలలో 18వ అంతర్జాతీయ ఇండో మలేషియన్ సదస్సు "ఔషధ రంగంలో ప్రపంచ స్థాయి సవాళ్లు - భవిష్యత్ ప్రణాళికలు" అనే అంశంపై అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్ ఆంధ్రప్రదేశ్ శాఖ, అంతర్జాతీయ మలేషి యా శాఖ సంయుక్తంగా నిర్వహించారు. శనివారం జరిగిన సదస్సులో డాక్టర్ సురేశ్ మాట్లాడుతూ, విద్యార్థులు సూక్ష్మమైన విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిశోధనలను చేసి మేధోసంపత్తి, హక్కులను పొందా లన్నారు. విద్యార్థులకు ప్రయోగాత్మక ఔషధ రంగంలో తగు సూచనలు ఇచ్చారు. ప్రొఫెసర్ షణ్ముఖ సుందరం, ప్రొఫెసర్ సోమనాథ్ డే, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సురేశ్

వీరమ్మ తిరునాళ్లకు తరలివస్తున్న భక్తులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 24 : వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పెద్దయెత్తున తరలివస్తున్నారు. తిరునాళ్లలో 6వ రోజు శనివారం మాఘ పౌర్ణమి కావడంతో పలు ప్రాంతాలనుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్లలో మాఘ పౌర్ణమి పురస్కరించుకుని అమ్మవారి ఆలయం వెనుక తడివస్త్రాలతో పాణాసారాలు పడ్డారు. డప్పు వాయిద్యాలు, మేళ తాళాలతో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పొంగళ్లు తయారు చేసి నైవైద్యం సమర్పించారు. వేకువజామునుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారి ఆలయం వెనుక పాణాసారం పడిన మహిళలు

పేదరాలికి కూరగాయల బండి సాయం

పెనమలూరు, ఫిబ్రవరి 24 : యనమలకుదురుకు చెందిన నిరుపేద మహిళ విజయకు యనమలకుదురు టీడీపీ కచేరీ సెంటర్ ఫ్రెండ్స్ సర్కిల్ కూరగాయల బండిని వితరణగా అందించింది. ఈ కార్యక్రమంలో మొక్కపాటి శ్రీనివాస్, బలగం కొండ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీటీఎఫ్ పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు

గన్నవరం, ఫిబ్రవరి 24 : ఎన్‌టీటీఎఫ్ కోర్సులు పూర్తి చేసిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని ఎల్ట్రానిక్స్ సిస్టమ్ సంస్థ చీఫ్ ఇంజనీర్ టీ.సాం బిరెడ్డి అన్నారు. మండలంలోని దావాజీ గూడెం ఎన్‌టీ టీఎఫ్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మహిధర్, ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్ ఎన్‌టీటీఎఫ్ జేఎండీ రాజగోపాలన్, ఏవో పద్మజ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరిస్తున్న ఎన్‌టీటీఎఫ్ జేఎండీ గోపాలన్

ఫోన్ యాప్ ద్వారా మోసపోయిన ఘటనపై కేసు

పెనమలూరు, ఫిబ్రవరి 24 : ఫోన్ లోన్ యాప్ ద్వారా లోను ఇస్తామంటూ చెప్పి ఒక వ్యక్తిని యాప్ నిర్వాహకులు మోసం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడప అంబేద్కర్ నగర్ కట్ట వద్ద నివాసముండే అంగ్రాజు లక్ష్మణబాబు ఈ నెల తొమ్మిదిన ఒక యాప్ ద్వారా వచ్చిన సమాచారం మేరకు లోన్ కోసం ఫోన్ చేశాడు. వారు లోన్ కోసం మొదట ప్రాసెసింగ్ ఫీజు ఐదున్నర వెయ్యి కట్టించుకున్నారు. తర్వాత ఇతర చార్జీల కింద మరో పన్నెండు వేలు కట్టమని చెప్ప గా వివిధ నంబర్లకు పన్నెండు వేలు చెల్లించాడు. తర్వాత ఫోన్ చేస్తుంటే అవతలి వైపు వారు లిఫ్ట్ చేయకపోతుండడంతో మోసపోయానని తెలుసుకొన్న బాధితుడు పెనమలూరు పోలీసులకు పిర్యాదు చేశాడు.

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

ఉంగుటూరు, ఫిబ్రవరి 24 : మండల పరిధిలోని పొణుకుమాడులగంగాపార్వతీ సమేత రాజేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో జీవధ్వజస్తంభ పునః ప్రతిష్టాపన, ద్వారపాలక, బలిపీఠం, కాలభైరవ విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం శనివారం వైభవోపేతంగా జరిగింది. పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేకపూజలు, హోమాల్లో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రో చ్చారణల మధ్య మేళతాళాలతో ఉదయం గం.11.46ని.లకు యంత్రస్థాపన, బింబస్థాపన(ధ్వజ ప్రతిష్ఠ), ద్వారపాలక, బలిపీఠం, కాలభైరవ విగ్రహాల ప్రతిష్ఠ, అనంతరం మహాపూర్ణాహుతి, మహానైవేద్యం, కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు.

టీడీపీ, జనసేన జాబితా ప్రకటనతో వైసీపీ గుండెల్లో రైళ్లు

కంకిపాడు, ఫిబ్రవరి 24 : టీడీపీ, జనసేన పార్టీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాతో వైసీపీ గుండెల్లో రైళ్లు పరుగుడెతున్నాయని మాజీ సీహెచ్‌సీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు అన్నారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రకటించిన 99 మంది అభ్యర్థుల జాబితాలో అత్యధిక శాతం విద్యావంతులే అన్నారు. టీడీపీ, జనసేన ప్రకటించిన జాబితాపై వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని టీడీపీ నాయకులకు పిలుపునిచ్చారు.